న్యాయమే గెలిచింది

ఆదోని టౌన్‌: స్కిల్‌ డెవలప్‌మెంట్‌ స్కామ్‌లో అరెస్టు చేసిన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుకు ఆదివారం ఏసీబీ కోర్టు రిమాండ్‌ విధించింది. ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో అవినీతికి పాల్పడ్డారని కోర్టు నిర్ధారించి రిమాండ్‌కు ఆదేశించింది. నిరుద్యోగుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాల్సిన సొమ్మును అక్రమంగా మళ్లించడం తేటతెల్లమవడంతో కోర్టు చర్యలకు ఆదేశించింది. అయితే ఎన్నాళ్లయినా, ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని మరోసారి నిరూపింతమైందని ప్రజలు భావిస్తున్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని మరోసారి నిరూపితమైందంటున్నారు.

నేను నిప్పునని గొప్పలు చెప్పాడు



14 ఎళ్లు ముఖ్యమంత్రిగా పని చేసినా అవినీతికి పాల్పడలేదని, నిప్పునని చెప్పినా, స్కిల్‌ డెవలప్‌మెంట్‌ స్కామ్‌లో ఆయన అవినీతి బయటపడింది. ఇప్పటికే పలు కేసుల్లో స్టేలు తెచ్చుకుని అలాటైపోయింది. ఇది కూడా అలాంటిదే.. ఏమి చేస్తుందని అనుకున్నా.. న్యాయం ఎప్పటికైనా గెలవడం సహజమే. ఇప్పుడు మరోసారి నిరూపితమైంది.

–నియాజ్‌అహ్మద్‌, బీఎస్‌ టాకీస్‌రోడ్డు

తప్పు చేసిన వాళ్లు శిక్ష అనుభవించాలి



తప్పు చేసిన వాళ్లు శిక్ష అనుభవించక తప్పదు. తప్పు చేసినా దొరకకుండా చంద్రబాబు వ్యవస్థలను మెనేజ్‌ చేశాడు. నీతి పరుడనని, నిప్పునని చెప్పుకుంటూ స్కిల్‌ డెవలప్‌మెంట్‌లో స్కాంలో ప్రజాధనాన్ని స్వాహా చేశాడు. తనను ఎవరూ ఏమీ చేయలేరని ధీమాతో ఉన్నా.. ఈ రోజు నిజం బయటపడటంతో కోర్టు చర్యలకు పూనుకుంది.

– చంద్రకాంత్‌రెడ్డి, షరాఫ్‌ బజార్‌

క్లుప్తంగా

శ్రీ మఠంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి వారిని దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వీరు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఏకదాశి కావడంతో భక్తులకు నిజరూప బృందావన దర్శనం చేసుకున్నారు. సోమవారం ద్వాదశి సందర్భంగా తెల్లవారుజామున పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

క్రికెట్‌ టోర్నీ విజేత కోసిగి



విజేతలకు నగదు, కప్‌ను అందజేస్తున్న దృశ్యం

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలో శ్రావణమాసం సందర్భంగా ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం పురస్కరించుకుని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్‌ టోర్నమెంట్‌లో కోసిగి జట్టు విజేతగా గెలుపొందింది. ఆదివారం గ్రామంలో కోసిగి , కందుకూరు గ్రామాల జట్ల మధ్య ఫైనల్‌ మ్యాచ్‌ హోరాహోరీగా సాగింది. ఇందులో కందుకూరు జట్టుపై కోసిగి జట్టు గెలుపొందింది. విజేత జట్టుకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ బెట్టనగౌడ రూ.15వేల నగదు, కప్‌ అందజేశారు. రెండవ బహుమతి కందుకూరు జట్టుకు గ్రామ నాయకుడు తాయన్న రూ.10వేలు అందజేశారు.

మూగలదొడ్డి రిజర్వాయర్‌కు నీరు విడుదల



రిజర్వాయర్‌లోకి నీరు చేరుతున్న దృశ్యం

కోసిగి: మండలంలోని మూగలదొడ్డి పంప్‌ హౌస్‌ నుంచి నీటిని పంపింగ్‌ చేసి ఆదివారం రిజర్వాయర్‌లోకి విడుదల చేశారు. కొద్ది రోజులు పంపింగ్‌ చేసే మిషన్లు మరమ్మతుకు గురవుతుండటంతో ఇప్పటి వరకు పంపింగ్‌ నిలిపివేశారు. దీంతో గ్రామ రైతులు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి ఇరిగేషన్‌ అధికారులతో చర్చించి మిషన్లను వెంటనే మరమ్మతులు చేయించి సాగునీటి అందించాలని సూచించారు. పంప్‌ హౌస్‌ వద్ద కొత్త మిషన్లు ఏర్పాటు చేయించి సాగునీటి పంపింగ్‌ ప్రక్రియ చేపట్టారు. ఈ రిజర్వాయర్‌ కింద 3,700 ఎకరాల ఆయకట్టు ఉంది. దీంతో రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం



నాటుసారా కేంద్రాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

ఆదోనిరూరల్‌: పట్టణంలోని బాలనాగన్న చెరువు వద్ద ఆదోనికి చెందిన బోయ చిన్నా అనే వ్యక్తి నాటుసారా తయారీ చేస్తుండగా గుర్తించి అరెస్టు చేసినట్లు సెబ్‌ సీఐ హరికృష్ణ ఆదివారం తెలిపారు. నాటుసారా తయారీ కేంద్రాన్ని ధ్వంసం చేసి 300 లీటర్ల బెల్లం ఊటను పారబోసి, 15 లీటర్ల నాటుసారాను పారబోసి, ఒక యాక్టివా స్కూటీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో సెబ్‌ ఎస్‌ఐలు మధుసూదనరెడ్డి, శివప్రసాద్‌, పీసీలు శ్రీనివాస్‌, సుధాకర్‌ పాల్గొన్నారు.

చవితిని సంప్రదాయబద్ధంగా జరుపుకుందాం



వినాయక ఉత్సవాలను ప్రారంభిస్తున్న శ్రీ గురు సిద్ధస్వామిజీ

ఆదోనిఅర్బన్‌ : వినాయక చవితి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని గురు సిద్ధస్వామిజీ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విశ్వహిందూ పరిషత్‌ కార్యాలయంలో పట్టణ గణేష ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలను ప్రారంభం సూచికగా ధ్వజారోహణ చేపట్టారు. సమితి నాయకులు మాట్లాడుతూ ఆదివారం నుంచి వినాయక ఉత్సవాలకు సంబంధించి మండపాల నిర్వాహకులు కమిటీల సమాచారాన్ని అందజేయాలని కోరారు. మితి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగఫణిశాస్త్రి, గౌరవాధ్యక్షులు ఎగటి ప్రతాప్‌, ప్రధాన కార్యదర్శి గోవిందరాజులుగౌడ్‌, జిల్లా సహ ప్రధాన కార్యదర్శి రంగస్వామి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవగౌడ్‌ పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్రశాఖ అధ్యక్షుడు డాక్టర్‌ రవికృష్ణ

ఆదోనిఅర్బన్‌ : వైద్యుల కొరత, ఆస్పత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఐఎంఏ రాష్ట్రశాఖ అధ్యక్షుడు డాక్టర్‌ రవికృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆదోని ఐఎంఏ శాఖ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్‌ విజయభాస్కర్‌రెడ్డి, ఆదోని నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఐఎంఏ అంటే ప్రైవేట్‌ వైద్యుల సంఘం అనే అపోహ ఉందని, కానీ తమ సంఘం సభ్యులు ప్రభుత్వ, ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో, వైద్య కళాశాలల్లో సేవలు అందిస్తున్నారన్నారు. ఇటీవల కాలంలో ఆస్పత్రులు, వైద్యులపై భౌతిక దాడులు దేశవ్యాప్తంగా పెరిగిపోతున్నాయని, వాటిని నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఆదోని ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్‌ ఉషాగోపీనాథ్‌, కార్యదర్శి డాక్టర్‌ కిరణ్‌, సీనియర్‌ వైద్యులు డాక్టర్‌ గోపీనాథ్‌, రాష్ట్ర వర్కింగ్‌ కమిటీ సభ్యులు డాక్టర్‌ పనీల్‌, డాక్టర్‌ కృష్ణమూర్తి, డాక్టర్‌ హరీష్‌ పాల్గొన్నారు.

మందు పిచికారీ చేస్తూ అస్వస్థత



అస్వస్థతకు గురైన ముదుకప్ప

ఆదోనిఅర్బన్‌ : హొళగుంద మండలం ఎండిహ్యాళ్లి గ్రామానికి చెందిన ముదుకప్ప పొలంలో పంటకు పురుగు మందు పిచికారీ చేస్తూ అస్వస్థతకు గురయ్యాడు. ఆదివారం సాయంత్రం పొలంలో అస్వస్థతకు గురైన ముదుకప్పను వెంటనే ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. భార్య లక్ష్మి తెలిపిన మేరకు పొలంలో మందు స్ప్రే చేస్తుండగా విష ప్రభావానికి లోనై కుప్పకూలాడు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు.

పద్య,నాటక పోటీల్లో నల్లారెడ్డి ప్రతిభ



నల్లారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఆదోనిఅర్బన్‌ : విజయవాడలోని శ్రీ కవిత పూర్ణానంద కళావేదికలో శ్రీదేవి కళానాట్యమండలి గుమ్మడి జయరాజ్‌ కళాపేట ఆధ్వర్యంలో శ్రీ సాయి హృదయ నాట్యమండలి విజయవాడ వారి సంయుక్త నిర్వహణలో బలిగేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్యహరిశ్చంద్ర నాటక పద్య పోటీలు ఈనెల 9, 10వ తేదీల్లో జరిగాయి. ఈ కార్యక్రమానికి గుమ్మడి జీవన్‌కుమార్‌ అధ్యక్షత వహించగా ఉపాధ్యక్షుడు గురుత్రినాథ్‌నాయుడు, ప్రధాన కార్యదర్శిగా చింతలపూడి నాగేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా తంగరడోణ గ్రామానికి చెందిన రంగస్థల కళాకారుడు, కవి లలిత కళా సేవా సంస్థ అధ్యక్షుడు లలిత కళావేదిక కార్యదర్శి జి.నల్లారెడ్డి హాజరై పోటీల్లో తన అభినయం, గాత్రంతో సభికులను అలరించారు. దీంతో కళా పీఠం అధ్యక్ష, కార్యదర్శులు మెమొంటో అందజేసి సన్మానించారు.

విద్యుత్‌ షాక్‌తో గాయాలు



గాయపడిన బాషా

ఆదోనిఅర్బన్‌ : హొళగుంద గ్రామానికి చెందిన బాషా అనే వ్యక్తి ఇంట్లో స్విచ్‌ వేయడానికి వెళ్లగా, విద్యుత్‌ షాక్‌ కొట్టడంతో గాయాలపాలయ్యాడు. వెంటనే బంధువులు ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్‌ చేశారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



చాకలి ఐలమ్మ,సత్తెనపల్లె రామకృష్ణ ఫొటోల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్‌/ ఆదోని రూరల్‌: పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ, సత్తెనపల్లె రామకృష్ణ జయంతిని ఆదివారం నిర్వహిఆంచారు. మడివాళ స్వామి ఆలయంలో ముక్కన్న అధ్యక్షతన చాకలి ఐలమ్మ, సత్తెనపల్లె రామకృష్ణ ఫొటోలకు పూలమాల వేసి నివాళులర్పించారు. రజక జిల్లా ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సిద్దప్ప, నరసింహ రాజు ఉపాధ్యాయుడు నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కారులుగా వారు చేసిన పోరాటాలను గుర్తు చేశారు. బేరి ఈరన్న, రామన్న, వెంకటేశులు, కిశోర్‌ దర్గన్న , గోవిందప్ప, ఈరన్న పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోనిరూరల్‌ : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు జె.రామాంజనేయులు, బి.వీరారెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో హమాలీ కార్మికుల సమావేశం యూనియన్‌ అధ్యక్షుడు రామదాసు అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాతూ హమాలీలు దుర్భరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి సమగ్ర వేతన చట్టం తీసుకురావాలని డిమాండ్‌ చేశారు. వయస్సు ఉన్నప్పుడు బరువులు మోసి జీవనం సాగించినా.. కొన్ని రోజులకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వారి సమస్యల పరిష్కారానికి నూతన చట్టం తేవాలని విజ్ఞప్తి చేశారు. వృద్ధాప్యంలో కనీస పెన్షన్‌ ఇవ్వాలని, గుర్తింపు కార్డులిచ్చి, వైద్య సౌకర్యం కలిప్పించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. నాయకులు అల్లప్ప, నరసింహులు, నాగిరెడ్డి, గోవిందు, రామన్న పాల్గొన్నారు.

ప్రాజెక్టులు పూర్తిచేయాలి

దేవనకొండ: జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేశఖర్‌ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని పి.కోటకొండ గ్రామంలో ప్రారంభమైన పాదయాత్ర బేతపల్లి, చెల్లెచెలిమల, బంటుపల్లి, గుడిమిర్లాళ్ల మీదుగా గుండ్లకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. పాలకులు, ప్రజాప్రతినిధుల చిత్తశుద్ధి లోపం వల్ల ఏటా వర్షాభావ పరిస్థితులతో కరువు ఏర్పడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ యేడాది ఖరీఫ్‌ సీజన్‌లో ఆగస్టులో వర్షాలు లేక పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. రైతులను ఆదుకోవాలని, పెండింగ్‌ ప్రాజెక్టులను పూర్తి చేసి, సాగునీటిని అందించాలని కోరారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కమిటీ నాయకులు గౌస్‌దేశాయ్‌, రైతుసంఘం, ప్రజా సంఘాల నాయకులు అశోక్‌, శ్రీరాములు, యూసుఫ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

వెల్దుర్తి: మండల పరిధిలోని సూదేపల్లె గ్రామానికి చెందిన మహేశ్వరి (17) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌ రెడ్డి ఆదివారం తెలిపారు. యువతి తండ్రి తిమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. శనివారం నాడు తాను, భార్యతో కలిసి పొరుగు గ్రామానికి పని నిమిత్తం వెళ్లి తిరిగిరాగా ఇంట్లో ఉండాల్సిన కుమార్తె కనిపించలేదన్నారు. పలు చోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించామన్నారు. బోగోలుకు చెందిన యువకుడు కిడ్నాప్‌ చేసి ఉండొచ్చన్న అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంబులెన్స్‌లో ప్రసవం



శిశివును చూపుతున్న అంబులెన్స్‌ సిబ్బంది

హొళగుంద: మండల పరిధిలోని సుళువాయి గ్రామానికి చెందిన చాకలి విశాలాక్షి అనే గర్భిణికి పురిటినొప్పులు రాగా 108 అంబులెన్స్‌ ఆదుకుంది. అంబులెన్స్‌ సిబ్బంది సాయం అందించడంతో వాహనంలోనే సుఖ ప్రసవం జరిగి తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారు. వివరాలు.. నిండు గర్భిణి విశాలాక్షికి ఆదివారం సాయంత్రం పురిటి నొప్పులు తీవ్రం కావడంతో ఆశ కార్యకర్త నాగవేణి 108కు సమాచారం అందించింది. హొళగుంద పీహెచ్‌సీ నుంచి గ్రామానికి చేరుకున్న అంబులెన్స్‌ సిబ్బంది గర్భిణిని వాహనంలో ఎక్కించుకుని ఆలూరుకు తరలిస్తుండగా అరికెర గ్రామం వద్ద నొప్పులు తీవ్రం అయ్యాయి. దీంతో ఎమర్జెన్సీ మెడికల్‌ టెక్నీషియన్‌ (ఈఎమ్టీ)లు ఎల్లయ్య, రంగస్వామి, పైలెట్‌ వినోద్‌కుమార్‌ వైద్య సాయం అందించడంతో విశాలాక్షి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వారిని ఆలూరు ఆస్పత్రిలో అడ్మిట్‌ చేసారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. విశాలాక్షికి ఇది మూడవ కాన్పు.

క్షుద్రపూజల కలకలం

వెల్దుర్తి: స్థానిక సంతబజారులో ఆదివారం తెల్లవారుజామున క్షుద్రపూజల కలకలం రేగింది. తండ్రీ, కుమారులు మారెన్న, అశోక్‌లు వివిధ దినపత్రికలలో పాత్రికేయులుగా విధులు నిర్వహిస్తున్నారు. సంతబజారులోని మారెన్న ఇళ్లు కమ్‌ షాప్‌ ఎదురుగా గల మెట్లపై క్షుద్రపూజలకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించాయి. నిద్రలేచిన కుటుంబీకులు తమ మెట్లపై నిమ్మకాయలు, కుంకుమ, పూలు, ప్లాస్టిక్‌ కవర్‌లో మరి కొన్ని వస్తువులు, కోడి గుడ్డుపై బొగ్గుతో ముఖచిత్రం ఆకారంలో గీసిన చిత్రం గమనించి భయాందోళనకు గురయ్యారు. ఇలాంటి క్షుద్రపూజల ఆనవాళ్లు తమ ఇంటి ముందు కనిపించడం గత రెండేళ్లలో ఇది పదో సారి అంటూ కుటుంబీకులు తెలుపుతున్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా సంతబజారులో నివాసాలు ఖాళీ చేసేలా ఇలాంటి క్షుద్రపూజలకు పూనుకుంటున్నట్లు తెలుస్తోందని పలువురు పేర్కొంటున్నారు. ఆదివారం నాటి ఘటనపై బాధితుడి పిర్యాదు మేరకు ఎస్‌ఐ చంద్రశేఖర్‌ రెడ్డి విచారణ చేపట్టారు. క్షుద్రపూజలకు భయపడి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు సిద్ధేశ్వర స్వామి రథోత్సవం



సిద్ధేశ్వర స్వామి రథం

ఆలూరు రూరల్‌: శ్రావణ మాసం చివరి సోమవారం పురస్కరించుకుని నేడు శ్రీ సిద్దేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు అశేష భక్తజనం నడుమ రథాన్ని ఎదురు బసవన్న ఆలయం వరకు లాగనున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పించారు. రథోత్సవంలో వేలాది భక్తులు పాల్గొననున్న నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్‌ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్‌: రానున్న పార్లమెంట్‌ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ ఆనంద్‌ చైతన్య డిమాండ్‌ చేశారు. పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో చేపట్టిన ఎస్సీ వర్గీకరణ దీక్షలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన బీజేపీ తర్వాత మాట తప్పిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఎమ్మార్పీఎస్‌ నాయకులు ఏసన్న, ప్రభాకర్‌, ప్రసాద్‌, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించకపోతే కేంద్ర ప్రభుత్వానికి తిరుగుబాటు తప్పదని ఎమ్మార్పీఎస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు మహాదేవ్‌ హెచ్చరించారు. ఆదివారం గోనెగండ్లలో ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో నాయకులు నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లలో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ అమలవుతున్నప్పుడు, ఎస్సీల్లోని 59 ఉప కులాల్లో వర్గీకరణ ఎందుకు ఉండరాదని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్‌ నాయకులు నరసింహుడు, నరసన్న, ఆదాము, నల్లన్న, బతకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కోసిగి: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరుగనుంది. వేకువజామున ఉరుకుంద నుంచి స్వామివారి ఉత్సవమూర్తిని పల్లకీలో ఆశీనులు గావించి పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య పాదయాత్రగా తిప్పలదొడ్డి, కామన్‌ దొడ్డి, కందుకూరు గ్రామాల మీదుగా రామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో తుంగభద్ర నది ఒడ్డుకు చేరుకుంటారు. అక్కడ ఉత్సవమూర్తికి నదీ జలాలతో పుణ్యస్నానం చేయిస్తారు. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు నదిలో స్నానాలు చేస్తారు. అనంతరం అక్కడి దింపుడు కట్టపై కొలువుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహా మంగళహారతులు ఇచ్చి భక్తుల దర్శనానంతరం కందుకూరు గ్రామం మీదుగా కామన్‌దొడ్డి, తిప్పలదొడ్డి మీదుగా ఆలయం చేరుకుంటారు.

కందుకూరులో క్రీడా పోటీలు..

ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం సందర్భంగా మండలంలోని కందుకూరు గ్రామంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సహకారంతో సోమవారం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు బెట్టనగౌడ తెలిపారు. తిప్పల దొడ్డి క్రాస్‌ రోడ్డు నుంచి కందుకూరు వరకు 5 కి.మీ. పరుగు పందెం పోటీలు, కట్ట ఎగురుట, లాంగ్‌ జంప్‌, ట్రిపుల్‌ జంప్‌, 100 కేజీలు, 200 కేజీల గుండు ఎత్తుట, ఇసుక సంచులు ఎత్తుట తదితర పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

చిన్నహ్యాట రోడ్డుకు మరమ్మతులు



రోడ్డును గ్రావెల్‌ వేసి బాగు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిన చిన్నహ్యాట రోడ్డును మంత్రి గుమ్మనూరు జయరాం ఆదివారం సొంత ఖర్చుతో బాగు చేయించారు. మంత్రి సూచన మేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ షఫివుల్లా, నాయకులు ఈశా, ఎంపీటీసీలు కెంచప్ప, శివన్న, కో ఆప్షన్‌ మెంబర్‌ సాయిబేష్‌ తదితరులు ఆదివారం గ్రావెల్‌తో తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. దాదాపు 5 కి.మీ వరకున్న ఈ రోడ్డు అధ్వాన్నంగా మారడంతో ప్రయాణికులు, ఆ మార్గంలోని చిన్నహ్యాట, బీజీ హళ్లి, ఎల్లార్తి, నెరణికి తదితర గ్రామాల ప్రజలతో పాటు ఎల్లార్తి దర్గాల దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై స్పందించిన మంత్రి గుమ్మనూరు జయరాం రోడ్డును బాగు చేసేందుకు సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులను పురమాయించారు. తన సొంత ఖర్చుతో ఆదివారం తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఇటాచిలు, ట్రాక్టర్లు పెట్టి హొళగుంద నుంచి చిన్నహ్యాట వరకు గ్రావెల్‌ వేసి తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయా గ్రామల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

పైర్లలో చీడపీడల వ్యాప్తి నివారించాలి

కృష్ణగిరి: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పైర్లకు ఆశించే చీడపీడలను నివారించాలని ఏఓ ఎస్‌.వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన ఆదివారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. మండలంలో గత వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు వాడుపట్టిన పంటలకు జీవం వచ్చిందన్నారు. అలాగే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వేరుశనగలో పచ్చ దీపపు పురుగులు ఆశించే అవకాశం ఉందని వీటి నివారణకు 10 లీటర్ల నీటిలో 3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్‌ మందును కలిపి పంటపై పిచికారీ చేయాలని సూచించారు. అలాగే వరిసాగులో చదరపు మీటరు 33 మొక్కలు ఉండేలా నాటుకోవడంతో పాటు కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 15వ తేదీలోగా రైతులందరూ ఈ–క్రాప్‌ నమోదు చేయించుకోవాలన్నారు.

వాతావరణ మార్పులను బట్టి జాగ్రత్తలు తీసుకోవాలి


– దేశీ శిక్షణ కార్యక్రమంలో బనవాసి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ వెల్లడి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న బనవాసి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ

కర్నూలు(అగ్రికల్చర్‌): వాతావరణ పరిస్థితులను బట్టి వివిధ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ పేర్కొన్నారు. ఆదివారం దేశీ డిప్లొమ కోర్సు కింద 5వ వారం ఇన్‌పుట్‌ డీలర్లకు కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్‌ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బనవాసి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ... వివిధ వాతావరణ పరిస్థితుల్లో రైతులు పాటించవలసిన పంటల సరళిని వివరించారు. ప్రకృతి వనరులైన నేల,నీరు, పైర్లు, గాలి తదితర వాటిని సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని సూచించారు. బెట్ట పరిస్థితులు ఉన్నప్పుడు, అధిక వర్షాలు పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ..వర్షాలు పడినప్పుడు ప్రతి చుక్క భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరిగే విధంగా చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాలను పెంచుకునేందుకు వాటర్‌షెడ్‌ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. దేశీ శిక్షణ కార్యక్రమంలో చెప్పే వివిధ అంశాలపై అవగాహన పెంచుకొని రైతులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో 40 మంది ఇన్‌పుట్‌ డీలర్లు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



తమలపాకుల అలంకరణలో మాళమల్లేశ్వర స్వామి

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో శ్రావణమాసం నాలుగవ ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు మల్లయ్య స్వామి మూల విరాట్‌లకు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, భండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, అర్చనలతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సింహాసన కట్ట ముందు నెరణికి భక్తులు డోలు వాయిస్తూ భక్తిని చాటుకున్నారు. మాళమల్లేశ్వరుడిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్‌ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

పల్లె పాటల్ని కాపాడుకోవాలి



కళాకారుల కళా రూపక ప్రదర్శనలు



జోగినాయుడును సన్మానిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్‌: పల్లె పాటలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని టీవీ సినిమా నటులు, ఏపీ క్రియేటివ్‌ కల్చరల్‌ హెడ్‌ జోగి నాయుడు అన్నారు. సీక్యాంప్‌ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర ప్రథమ మహాసభల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఆట పాట యాసే తనకు అన్నం పెడుతుందన్నారు. జానపదాల్ని కాపాడుకుంటూ ఎంతో మంది కళాకారులను కలుపుకుంటూ సమాజ చైతన్యం కోసం రంగం ప్రజా సాంస్కృతిక వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అంతకు ముందు కళాకారులు ప్రదర్శించిన కళా రూపాలు అలరించాయి. రంగం రాష్ట్ర అధ్యక్షుడు అనంత కరుణాకర్‌ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, రంగం రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌, జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌, రంగం సభ్యులు, కళాక్షేత్రం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

గోనెగండ్ల: 26 జిల్లాల టైలర్ల ఆధ్వర్యంలో ఈ నెల 17న ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని టైలర్ల సంఘం జిల్లా కార్యదర్శి నజీర్‌ అహమ్మద్‌ పిలుపునిచ్చారు. ఆదివారం గోనెగండ్లలో టైలర్ల రాష్ట్ర మహాసభకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టైలర్ల సమస్యలను పరిష్కరించుకునేందుకు రాష్ట్ర మహాసభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని జిల్లాల టైలర్లందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. టైలర్లు నరసింహుడు, ఖాసీంవలి, అబ్దుల్‌ నజీర్‌, అల్లాబకాష్‌, గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.